ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 30 జనవరి 2024

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు

- బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో చాన్స్ ఇవ్వకుండా ఎత్తుగడలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలు ఎమ్మెల్యేలకు
- మంత్రులు కొండా, పొంగులేటికి వరంగల్, మహబూబాబాద్ స్థానాల బాధ్యతలు
- ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం



వరంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పార్లమెంట్ స్థానాలకు మంత్రులను ఇంచార్జులుగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు, కీలక నేతలకు అప్పగించింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో విజయంపై సమీక్షలు నిర్వహిస్తు పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. దీంతో ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ కసరత్తు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీ సీట్లపైనే హస్తం ఫోకస్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు ఉండగా, కనీసం 12 స్థానాలైన గెలువాలని ఏఐసీసీ నుంచి ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ ఇంచార్జీగా మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఇటీవల స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై హైదరాబాద్‌లో సమీక్ష కూడా నిర్వహించారు. రెండు ఎంపీ స్థానాలను గెలుచుకునేలా వ్యూహాలు రూపొందించాలని మంత్రులకు సీఎం సూచించారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా ఆరు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 6,63,556 ఓట్లు పొందగా, బీఆర్ఎస్‌కు 4,33,368 ఓట్లు, బీజేపీకి 1,56,638 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 2,41,987 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో ఈసారి వరంగల్ ఎంపీ సెగ్మెంట్‌లో పాగా వేయడం పెద్ద కష్టం కాదనే ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లను పొందగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు పోలయ్యాయి. ఇక బీజేపీకి కేవలం 34,431 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 2,30,188 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో కాంగ్రెస్‌కు భారీగా ఓటు బ్యాంకు పెరగడంతో ఎంపీ ఎన్నికల్లో గెలుపై ధీమాగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోటీ ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ నియోజకవర్గాలు	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	07	6,63,556	4,33,368	1,56,638
మహబూబాబాద్	07	6,85,897	4,43,910	34,431

కాంగ్రెస్‌కు తొలి సవాల్...

గత ఏడాది డిసెంబరు 7వ తేదీన కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్ ఎదుర్కొనుంది. ఇటీవల సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో తన మిత్రపక్షం సీపీఐతో కలిసి కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ సంఘాలు జాడ లేకుండా పోయాయి. అయితే ఇది ఒక వర్గానికి సంబంధించిన ఎన్నికలే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఫిబ్రవరిలో మరో హామీని కూడా అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. మార్చి, ఏప్రిల్ నాటికి మిగతా రెండు హామీలను కూడా అమలు చేసి పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ ఉంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపుతో పాటు ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు ఇచ్చే తీర్పు ఇదే కావటంతో ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి.



అయితే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పరకాల, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీ కొంత ప్రభావం చూపించింది. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది. దీంతో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తుంది. అయితే పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ కూడా అడుగుతుంది. అయితే దీనిపై ఎలాంటి స్పష్టత లేకున్నప్పటికీ రెండు ఎంపీ సీట్లను మాత్రం పక్కాగా గెలుచుకోవాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై...

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్ రెడ్డి డిసెంబరు 9న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జూన్ 8వ తేదీ వరకు ఉప ఎన్నికకు గడువుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఏప్రిల్ నెల లేదంటే జూన్ మొదటి వారంలోనే ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా, నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజార్టీ లేకపోవటంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.

2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాములునాయక్

»» మిగతా 7వ పేజీలో..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ అశ్విని

వరంగల్ కలెక్టరేట్, జనవరి 29: ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి అడిషనల్ కలెక్టర్ అశ్విని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. మొత్తం 103 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూకు సంబంధించి 47, మునిసిపాలిటీ 13, సివిల్ సప్లైం స్9, పంచాయతీ రాజ్ 6, పోలీస్ 4, లీడ్ బ్యాంకు 3, కార్మికశాఖ 3తోపాటు మరో 18 ఫిర్యాదులు ఇతర శాఖలకు దాఖలయ్యాయి. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామి రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరామ్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్



నర్సంపేటలో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట, జనవరి29: కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను విమర్శించే స్థాయి, నైతిక హక్కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేదని తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని టీజేఎస్ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడాన్ని కేటీఆర్ వ్యతిరేకించి మాట్లాడడం అవివేకమన్నారు. రాజ్యాంగం ప్రకారమే ప్రభుత్వం కోదండరామ్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌ను కేటీఆర్ విమర్శించడాన్ని తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా కోదండరామ్‌పై నిర్బంధాలు ప్రయోగించడంతోపాటు ఆయన ఇంటిపై అర్ధరాత్రి ఇంటి తలుపులు పగుల గొట్టి దాడి చేయించారని విమర్శించారు. కోదండరామ్ ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడపడం వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, లేకుంటే మీ నాన్న కేసీఆర్ సీఎం అయ్యే వారా, నీవు మంత్రివి అయ్యేవాడివా, మీ కుటుంబం వారు మంత్రులయ్యే వారా అని కేటీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ 2023 ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. సామాజి సేవ కార్యక్రమా ల్లో పాల్గొనడంతోపాటు తెలంగాణ ఉద్యమ సారథిగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించారన్నారు. కేసీఆర్ కాలిగోటికి సీఎం రేవంత్‌రెడ్డి సరిపోడని విమర్శించడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని శ్రీనివాస్ అన్నారు. స్థాయికి మించి విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదన్నారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్కె. జావిద్, సోల్తి సాయికుమార్, సాంబరాతి మల్లేషం, గుంటి సంజీవ, సంధాని పాల్గొనన్నారు.

ట్రాక్టర్ టైర్లను అమ్ముకున్న సర్పంచ్..?

పర్వతగిరి, జనవరి 29 : మండలంలోని ఒక గ్రామానికి చెందిన సర్పంచ్ గ్రామ పంచాయతీకి సంబంధించిన నూతన టైర్లను అమ్ముకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... 2019లో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలను కేటాయించింది. దీనిలో భాగంగానే మండలంలోని ఒక గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను అందించింది. కాగా, సర్పంచ్ తోపాటు ఆమె భర్త నూతన ట్రాక్టర్ టైర్లను అమ్ముకుని వాటి స్థానంలో పాత టైర్లను వేయించినట్లు సమాచారం. ఇదే విషయమై ఎంపీవో పాక శ్రీనివాసులును వివరణ కోరగా విషయం తన దృష్టికి సైతం వచ్చిందని, సంబంధిత కార్యదర్శిని విచారణ నిమిత్తం ఆదేశించామని తెలిపారు.



వెంకటేశ్వర్ రావు, మోహన్‌రెడ్డి, సంధ్యారాణి, గణపతి

ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

- నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన
- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త వారికి త్వరలో నోటిఫికేషన్

7



అధికారికి ఫిర్యాదు చేస్తున్న డైరెక్టర్లు

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని ఫిర్యాదు

దుగ్గొండి, జనవరి 29 : నాచినపల్లి సహకార సంఘం నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని సొసైటీ డైరెక్టర్లు కలెక్టర్, జిల్లా సహకార శాఖ అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. తిమ్మంపేట గోదాము నిర్మాణం నిధులు రూ.9లక్షలు, మక్కలు, ధాన్యం కొనుగోలు రవాణా చార్జీలు, సొసైటీ పరిధిలోని సీసీ పనుల డబ్బులు దుర్వినియోగమయ్యాయని, వెంటనే విచారణ చేపట్టాలని డైరెక్టర్లు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సొసైటీ ఉపాధ్యక్షుడు జి.ధర్మారెడ్డి, డైరెక్టర్లు నరహరి భాస్కర్‌రెడ్డి, నరహరి సునీత, అజ్మీర సాంబయ్య, సూరారెడ్డి, ఎం.రాజు, నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్, సదానందం, సంజీవరావు ఉన్నారు.

నర్సంపేటలో అవిశ్వాసంపై సమావేశం

విప్ పత్రంపై 15మంది కౌన్సిలర్ల సంతకం

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ వెల్లడి



నర్సంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కౌన్సిలర్లు, నాయకులు

నర్సంపేట, జనవరి 29 : నర్సంపేట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్ మాట్లాడుతూ సమావేశానికి 18మంది పార్టీ కౌన్సిలర్లకుగాను 15 మంది హాజరయ్యారని తెలిపారు. మరోముగ్గురు గుంటి రజని, ఎండి.పాషా, దార్ల రమాదేవి గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ ముగ్గురు కొన్ని రోజులుగా పార్టీకి అందుబాటులోకి రావడం లేదన్నారు. క్యాంపులను నిర్వహించడానికి పార్టీ అనుమతి ఇవ్వలేదన్నారు. పార్టీ విప్ పత్రాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జారీ చేయగా, 15 మంది సభ్యులు విప్ పత్రం స్వీకరించి సంతకాలు చేశారన్నారు. ఈ విప్ పత్రం స్వీకరించడానికి ముగ్గురు అందుబాటులోకి రాలేదని, వారిపై పార్టీ తదుపరి చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగా వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు శీలం రాంబాబు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, బీరు రాజు, దేవోజు తిరుమల, బానాల ఇందిర, పద్మ, గందె రజిత, గంప సునీత, నాయకులు రుద్ర ఓంప్రకాశ్, నాగిశెట్టి ప్రసాద్, వేల్పుగొండ రాజు, రామసహాయం సుధాకర్‌రెడ్డి, గందె చంద్రమౌళి. గంప రాజేశ్వర్, వేణు ముద్దల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, సమావేశం అయిపోయిన సమయంలో ఎంపీ కవిత వచ్చారు.

కాంగ్రెస్ విషపూరిత ప్రచారంతోనే ఓడిపోయాం

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు



సుబేదారి, జనవరి 29 : గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ విషపూరిత ప్రచారం చేయడంతోనే ఓడిపోయామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమిని సమీక్షించుకుని రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కాంగ్రెస్ రైతుబంధు ఇవ్వకుండా రైతులకు నోట్లో అరటిపండు పెట్టిందన్నారు. అసలు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయడం అసాధ్యమన్నారు. 100 రోజుల్లో కాకుంటే కనీసం 5 సంవత్సరాలలోనైనా మీ హామీలు అమలు చేయాలన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9వ తేదీన రైతుబంధును రైతుల అకౌంట్లో వేస్తామని చెప్పి ఇంకా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 50రోజులలోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో విషప్రచారం చేయడం వల్లే గెలిచిందన్నారు. అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గంలోని సర్పంచ్‌లను సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజల పక్షాన పోరాడుతానన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారి తీసిన పరిస్థితులను సమీక్షించుకుని తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా కోప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీతో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు లేనట్లే..

- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- ప్రత్యేకాధికారుల పాలన దిశగా ప్రభుత్వం అడుగులు
- ఇంకా ఖరారుకాని రిజర్వేషన్లు..
- పార్లమెంట్ ఎన్నికల తర్వాతే ఉండొచ్చని అంచనా..
- జడ్పీటీసీ, ఎంపీటీసీలతో కలిపి ఎన్నికలు జరిపే చాన్స్
- జిల్లాలో 323 గ్రామాలు..



మరియపురం గ్రామ వ్యూ

వర్ధన్నపేట, జనవరి 29: స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనని తేలిపోయింది. సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. దీంతో ప్రత్యేక అధికారుల పాలన తీసుకురావాలని సర్కారు అడుగులు వేస్తోంది. నేడో, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్దేశిత గడువులోగా జరగవని, ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరి అని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించిన కసరత్తు ప్రారంభించనున్నారు. జూన్‌లో స్థానిక సంస్థలతోపాటే, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలాఉంటే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన కసరత్తును ప్రారంభించాలని ఇటీవల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించినా, రిజర్వేషన్ల కేటాయింపుపై స్పష్టతనివ్వలేదు. ఈక్రమంలోనే ఎన్నికలు మరింత జాప్యం జరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతేనా..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్, లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తోంది. ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ మార్గదర్శకాల అనుగుణంగా దరఖాస్తుల పరిశీలించి ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే నెలాఖరులోగా

»» మిగతా 8వ పేజీలో..

ముగిసిన అన్నారం ఉర్సు


దర్గాలో పూజలు చేస్తున్న ముజావర్లు

పర్వతగిరి, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు చివరి రోజైన సోమవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన వేడుకల్లో చివరి రోజు ఖత్మల్ ఖురానా (ఖురాన్ పఠనం)తో ముగిసాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వీరభద్ర రావు తెలిపారు.

పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్కాలర్స్ వినతి

కేయూ క్యాంపస్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పరిశోధన చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇప్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి కేయూ పరిశోధకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉషన్‌నాయక్, కళ్లెపల్లి ప్రశాంత్‌ల నేతృత్వంలో సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఉషన్‌నాయక్, ప్రశాంత్‌లు మాట్లాడుతూ..వర్సిటీల పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలన్నారు. పరిశోధనల్లో నాణ్యతకు ఫెల్లోషిప్‌లు దోహదపడుతాయని అన్నారు. ఒడిస్సా, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలు సీఎం రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పథకం క్రింద ఫెల్లోషిప్‌లు ఇస్తున్నాయని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కుర్సా నాయకులు తెలిపారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కుర్సా అధ్యక్షుడు ఉషన్‌నాయక్, ప్రశాంత్

ఈ కార్యక్రమంలో కుర్సా జనరల్ సెక్రటరీ కళ్లెపల్లి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ జానకి రామ్, కోశాధికారి అంగడి సతీశ్, ఈసీ మెంబర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య

ఐనవోలు, జనవరి 29: హనుమకొండ ఫాతిమానగర్‌లో నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఐనవోలులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఐటీయూ జాతీయ సమావేశాలు ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఫాతిమానగర్ బాలవికాస్‌లో జరుగుతాయని తెలిపారు.


మాట్లాడుతున్న చుక్కయ్య

ఈ సమావేశాల్లో కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. 31న బహిరంగ సభ ఉంటుందని వేయిస్తంభాల ఆలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ కార్మిక ర్యాలీ జరుగుతుందన్నారు. ఈసమావేశాల్లో బీవీ రాఘవులు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, తపన్‌సేన, ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగసభకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేఎస్ రెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, కుసుంబ దేవేందర్, నర్సయ్య, కొమురయ్య, మేకిరి మోహన్‌రావు తదతరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ఆచార్య రమేశ్

మరణ సందేశం పుస్తకావిష్కరణ

వడ్డెపల్లి, జనవరి 29: సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ రాసిన మరణ సందేశం పుస్తకాన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్ సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆవిష్కరించారు. తొలుత జర్నలిస్టు గౌరీ లంకేష్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రమేశ్ మాట్లాడుతూ మరణ సందేశం పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమన్నారు.

ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, అంతడుపుల శ్రీనివాస్, బండి మొగిలి, ప్రజాసంఘాల నాయకులు నల్లెల్ల రాజయ్య, రమేశ్‌రాజా, కోగిల చంద్రమౌళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

▸▸ 5వ పేజీ తరువాయి

నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తీన్మార్ మల్లన్న, కోదండరాంలు ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్ద తుగా ఉండడంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. దీంతో ఈసారి భారీ ఎత్తున గ్రాడ్యుయేట్స్ ఓట్లను నమోదు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. తన నియోజకవర్గ ప రిధిలో సాధ్యమైనంత వరకు ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయాలని ఎమ్మెల్యేకు పార్టీ టాస్క్ ఇచ్చింది. పది రోజులుగా పట్టభద్రుల ఓట్ల కోసం ఎమ్మెల్యేలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు.. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన ఎంపీ, ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవటంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది.



టీఎస్ఎన్పీడీసీఎల్‌లో ప్రక్షాళన

నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన

- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త డైరెక్టర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్పీడీసీఎల్) ఎట్టకేలకు ప్రక్షాళన మొదలైంది. గత పదేళ్లుగా పాతుకు పోయిన నలుగురు డైరెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్పీడీసీఎల్‌తో పాటు టీఎస్ఎస్పీడీసీ ఎల్‌లోని ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగించారు. దీంతో ఒక్క కలంపోటుతో మొత్తం పదకొండు మంది డైరెక్టర్లు ఇంటిదారి పట్టారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్టుగా ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ఇక వీటికి మంచి రోజులు వచ్చినట్టేనని విద్యుత్ వినియోగదారులు, వాటిలో పని చేస్తున్న ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్పీడీసీఎల్‌లో ప్రక్షాళన షురూ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న ప్రత్యేకం కథనం వచ్చింది. చెప్పినట్టుగానే డైరెక్టర్ల తొలగింపు జరిగింది.

వేటు పడిన డైరెక్టర్లు

టీఎస్ఎన్పీడీసీఎల్‌లో వేటు పడిన డైరెక్టర్లలో బి.వెంక టేశ్వర్ రావు (హెచ్ఆర్), పి.మోహన్‌రెడ్డి (ప్రాజెక్టులు), పి.సంధ్యారాణి (కమర్షియల్), పి గణపతి (ఐపీసీ అండ్ ఆర్ఏసీ) ఉన్నారు. బి.వెంకటేశ్వర్ రావు మినహా మిగతా ముగ్గురు డైరెక్టర్ల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నలుగురు నిబంధనలకు వ్యతిరేకంగా చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నందు వల్లనే వారిని తొలగించినట్టు పేర్కొన్నారు. బి.వెంకటేశ్వర్ రావు (డైరెక్టర్ హెచ్ఆర్) 2013 జులై 31న నియమితులయ్యారు. 10 సంవత్సరాల 5 నెలల పాటు కొనసాగారు. వెంకటేశ్వర్ రావు 2007లో సీఈగా రిటైర్ అయ్యారు. ఆ తర్వాత అయిదేళ్లకు డైరెక్టర్ అయి అప్పటి నుంచి కొనసాగుతూ వస్తున్నారు. పి.మోహన్‌రెడ్డి (డైరెక్టర్ -పాజెక్టులు) 2018 సెప్టెంబరు 5 తేదీన నియమితులయ్యారు. 5 సంవత్సరాల 4 నెలలుగా ఆయన కొనసాగుతు న్నారు. ఈయన 2006లో సీఈగా రిటైర్ అయ్యారు. మోహన్‌రెడ్డికి 2009లో ఒక సారి, 2011లో రెండో సారి, 2018లో ముచ్చ టగా మూడో సారి ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.పి.సంధ్యారాణి (డైరెక్టర్-కమర్షియల్) 2018 సెప్టెం బరు 5న నియమితులయ్యారు. ఆమె కూడా 5 సంవత్సరాల 4 నెలలుగా కొనసా గుతున్నారు. ఈమె 2021లో సీఈగా రిటైర్ అయ్యారు. అయితే 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగి హోదా లో డైరెక్టర్ గా కొనసాగుతూ వచ్చారు. అలాగే పి.గణపతి (డైరెక్టర్- ఐపీసీ అండ్ ఆర్ఏసీ) కూడా 2018 సెప్టెంబరు 5న నిమితులై గత 5 ఏళ్ళ 4 నాలుగు నెలలుగా కొనసాగుతు న్నారు. ఈయన 2014 ఆగస్టులో రిటైర్ కావలసి ఉన్నది. 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగిగా డైరెక్టర్ హోదాలో కొనసాగుతూ వచ్చారు.



గత సీఎండీ గోపాల్‌రావుతో ప్రస్తుతం తొలగింప బడిన డైరెక్టర్లు

నాలుగేళ్లు మించకూడదు

సాధారణంగా ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లుగా విద్యుత్ సంస్థల్లో సీఈ హోదాలో రిటైర్ అయిన వారిని లేదా ఇంకా రెండేళ్లలో రిటైర్ కానున్న ఇన్‌సర్వీస్ ఉద్యో గులను డైరెక్టర్లుగా నియమిస్తారు. డైరెక్టర్లను తొలు త రెండేళ్ల కాలపరిమితితో మాత్రమే నియమించాలి. ఆ తర్వాత అవసరాన్ని బట్టి వారి కాలపరిమితిని మరో ఏడాది పొడిగించవచ్చు. గరిష్ఠంగా రెండు సా ర్లు మాత్రమే వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలి. ఏ డైరెక్టర్ అయిన నాలుగేళ్లకు మించి పని చేయరాదు. కానీ ఎన్పీడీసీఎల్‌లో ఇందుకు విరు ద్ధంగా డైరెక్టర్లకు ఇష్టారీతిన పొడిగింపులు ఇస్తూ వెళ్లారు. వెంకటే శ్వర్‌రావు (డైరెక్టర్-హెచ్ఆర్ఏ) గత పదేళ్లుగా కొన సాగుతున్నారు. ఆయన పదవీ కాలంలో నలుగురు సీఎండీలు మారారు. ఎన్పీడీసీఎల్‌లో మొత్తం అ యిదుగురు డైరెక్టర్లలో ఈ నలుగురు పోను మరో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం ఎకౌంట్స్)గా పని చేస్తున్న తిరుపతి రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఇన్‌చార్జి డైరెక్టర్ మాత్రమే. అంతకు ముందు పని చేసిన డైరెక్టర్ పదవీ కాలం ముగియడంతో ఆయన బాధ్యతలను తిరుపతి రెడ్డికి అప్పగించారు.

టీఎస్ఎస్పీడీసీఎల్

తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్పీడీసీఎల్)లోనూ ప్రస్తుతం సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న మ రో ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగిస్తూ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. జె.శ్రీనివాసరెడ్డి (డైరెక్టర్-ఆపరేషన్స్), టి.శ్రీనివాస్ (డైరెక్టర్-ప్రాజెక్టులు), కె రాములు (డైరెక్టర్ కమర్షియల్, డీపీఈ, అసెస్‌మెంట్ అండ్ ఎనర్జీ ఆడిట్), జి.పర్వతం (డైరెక్టర్-హెచ్ఆర్ అండ్ ఐఆర్) సీహెచ్ మదన్ మోహన్ (డైరెక్టర్ పీఅండ్ఎంఎం) ఎస్.స్వామిరెడ్డి (డైరెక్టర్-ఐపీసీ అండ్ ఆర్ఏసీ), గంపా గోపాల్ (డైరెక్టర్,ఈ ఆడిట్, డీపీఈ అండ్ అసెస్‌మెంట్) వీరిలో ఉన్నారు. వీరిలో జె.శ్రీనివాస్ రెడ్డి 9 సంవత్సరాలు 2 నెలలుగా, టి శ్రీనివాస్ 10 సంవత్సరాల 5 నెలలుగా కొనసాగుతున్నారు. మిగతా వారంతా 5 సంవత్సరాల 5 నెలలుగా పని చేస్తున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకం త్వరలో జరగవచ్చునని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

మహాజాతరను విజయవంతం చేద్దాం..

- అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, జనవరి 29 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహాజాతరను విజయవంతం చేసేందుకు అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నా రు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులతో ఆయన సోమ వారం సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఈవో రాజేందర్ ఆధ్వర్యంలో మేడారం లో ఈ సమావేశం జరిగింది. మహాజాతరను విజయవంతం చేయడా నికి చేపడుతున్న కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూజారులు, అధికారులు సమన్వయంగా జాతరను విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

పూజా కార్యక్రమాలు, వాటికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావును అడిగి తెలుసు కున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, పొనుగొండ్ల నుంచి లక్ష్మీపురం మీదుగా పగిడిద్దరాజును తీసుకొచ్చే సమయంలో పోలీసు రోప్ పార్టీల ద్వారా భద్రత కల్పించేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవార్లను తీసుకొచ్చే సమయంలో మూడంచల భద్రత అవసరం ఉంటుందన్నారు. వనదేవతల పూజారులకు ఎండోమెంట్ ద్వారా శాశ్వత గదులు కేటాయించాలన్నారు.

దేవస్థానం కోసం కేటయించిన స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పూజారులకు వసతి, సౌకర్యాలు కల్పిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, పూజారులు వెంకటేశ్వరు, గోవర్ధన్, ప్రభకర్, నర్సింగరావు, భోజరావు, రమేష్, రాజేశ్వర్, పూర్ణచందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ సన్నద్ధం : ఎస్పీ శబరీశ్

ములుగు, జనవరి 29: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను విజయవం తంగా జరిపించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమ వుతోందని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపడతామని అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కుంభమేళా స్థాయిలో జరిగే మేడారం జాతర నిర్వహణ బాధ్యత పోలీసు శాఖ ద్వారా తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామ న్నారు. గత జాతర సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటా మని అన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, భక్తులు, వీఐపీల రక్షణపై దృష్టి సారించామని తెలిపారు. సాధ్యమైనం తవరకు పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జాతర నిర్వహణలో ప్రజలు పోలీసు శాఖకు సహకారం అందించాలని ఆయన కోరారు.





దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటరు దరఖాస్తు ఫారాలను ఆయన పట్టభద్రులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మా ట్లాడుతూ... త్వరలో జరుగనున్న ఖమ్మం, నల్లగొండ వరంగల్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల్లోని పట్టభద్రులందరు ఓటు నమోదు ప్రక్రియను సత్వరమే పూర్తి చేయా లని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, ఉపేందర్‌రెడ్డి, రాజు, అశోక్‌రావు, రాజు, చంద్రమోహన్, రమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాజేందంర్‌రెడ్డి, సోమేశ్వరశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, రఘుపతి పాల్గొన్నారు.

యాసంగి వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరంగల్ సిటీ, జనవరి 29: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుచేస్తున్న యాసంగి వరిలో కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల ఉధృతి పెరుగుతుండటంతో రైతులు తీసుకోవాల్సిన పలు సస్యరక్షణ చర్యలను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశో ధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, యు. నాగభూషణం, ఎం.విశ్వతేజ క్షేత్రస్థాయిలో రైతులకు వివరిం చారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి వరి పొలాలు, నారుమళ్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు సలహాలు, సూచనాలు అందజేశారు. పురుగుల ఉధృతిని గమనిం చడానికి దీపపు ఎర, సోలార్ ఎర, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. వరి పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసి అందులో వారానికి బుట్టలో 25-30 పురుగులు పడినప్పుడు పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



నారాయణగిరిలోని పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

నేడు కేయూలో ప్రాంగణ నియామకాలకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 29: కేయూ కెమిస్ట్రీ విభాగంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని లురస్ ల్యాబ్ రిసెర్చ్ అనలిస్టులుగా పనిచేసేందుకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఫార్మసీ క్వాలిటీ అనలటిక్స్/ఫార్మా అనలటిక్స్ పూర్తి చేసిన వారు ప్రసుత్తం చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాలని, ఏడాదికి రూ. 2.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. బయోడెటా, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అకాడమిక్ ధృవపత్రాలు, సంబంధిత కళాశాల ఐడీ కార్డుతో నేరుగా ప్రాంగణ నియామకాలకు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 12

కేయూ క్యాంపస్, జనవరి 29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 12 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.



ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

టీచర్‌గా మారిన అడిషనల్ కలెక్టర్

- పాఠ్యపుస్తకాల్లోని అంశాలపై ప్రశ్నలు

భీమదేవరపల్లి, జనవరి 29 : జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా టీచర్ అవతారం ఎత్తారు. సోమవారం ముల్కనూర్ ప్రాథమిక పాఠ శాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థు లను తెలుగు, గణితంలో వివిధ ప్రశ్నలు అడిగారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు తడబాటుకు గురయ్యారు. దీంతో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందిం చాలని సూచనలు చేశారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉద్యోగ లక్ష్యం దిశగా ఎంచుకొని అందుకు తగ్గట్టు చదువుకోవాలని సూచిం చారు. అలాగే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ముల్క నూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం భీమ దేవరపల్లిలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పోటీ పరీక్షలకు చదువు కునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందులో ఏర్పాటు చే యాలని లైబ్రేరియన్ వాగు శివాజీకి సూచించారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంరయ్య, విద్యా కమిటీ చైర్మన్ పూర్ణచందర్, ముల్కనూర్ ఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.



పీఎంఎఫ్ఎంఈపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉమారెడ్డి

పీఎంఎఫ్ఎంఈపై అవగాహన

వరంగల్ సిటీ, జనవరి 29: ములుగురోడ్‌లోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం పీఎంఎఫ్ఎంఈ(ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్)పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, తెలంగాణ రాష్ట్రీయ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ ఆకాశ్ పాల్గొని ఎఫ్‌పీవోలకు పీఎంఎఫ్ఎంఈ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవోల నిర్వాహకులు పాల్గొని వారి వ్యాపారాభివృద్ధిని వివరించారు. వివిధ ఎఫ్‌పీవోల నిర్వాహకులు సాంబయ్య, పాపారావు, సరిత, రామ్‌గోవింద్ పాల్గొన్నారు.

'బీసీలకు సముచిత స్థానం కల్పించాలి'



డాక్టర్ అశోక్‌ను సన్మానిస్తున్న పలు సంఘాల నాయకులు

కరీమాబాద్, జనవరి 29: బీసీలకు గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ స్థాయి వరకు సముచిత స్థానం కల్పించాలని, జనగణనలో బీసీల కాలం తప్పనిసరిగా చేర్చాలని బీసీ సామాజిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఆర్ఆర్ తోటలోని కార్యాలయంలో బీసీ సామాజిక కార్యకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను సీనియర్ వైద్యులు ఎస్ఆర్ఆర్ తోటలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాజేందర్ మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ రెండేళ్లలో కోటి ఉత్తరాల ఉద్యమంతో ప్రధానికి పరికిపండ్ల అశోక్ నిరంతరం ఉత్తరాలు చేర్చడం గొప్ప విషయమన్నారు. అంతేకాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతరం పర్యటిస్తూ బీసీ సమాజాన్ని జాగృతం చేస్తున్న ఆయన్ను అభినందించారు. అశోక్ మాట్లాడుతూ బీసీలు శాంతియుతంగా రాజ్యాధికారం దిశగా పయనించాలని, రాజ్యాంగబద్ధంగా మనమెంతో మనకంతా అనే సామాజిక న్యాయం జరగక తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల న నాయకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేణు, పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంఘం నాయకులు సుధాకర్, అఖిలభారత పద్మశాలి ఇంజనీర్ల సంఘం నాయకులు యాదగిరి, ఎంపీడీవో విద్యాసాగర్, పద్మ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణశాస్త్రి, వివిధ కుల సంఘాల నాయకులు సారంగపాణి, దామోదర్, సత్యరాజు, సుదర్శన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాము కిరణ్, విజయ్ చంద్ర, సాయి పాల్గొన్నారు.

కొత్త కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తా



కాలనీ సూచిక బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్, కాలనీవాసులు

కరీమాబాద్, జనవరి 29: డివిజన్‌లో నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో, మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం కరీమాబాద్ వాటర్‌ట్యాంక్ నుంచి ఉర్సు చెరువుకు వెళ్లేదారిలో నల్లరాళ్ల వద్ద నూతనంగా ఏర్పడిన కాలనీకి ఆ కాలనీవాసులు ఉర్సు ప్రగతి నగర్‌గా నామకరణం చేస్తూ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ఆ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖలీల్, గౌడ రాము, బానోత్ బద్రు నాయక్, అన్న శ్రీనివాస్, దాసి రవి చందర్, మరుపల్ల గౌతం, బసిత్ కర్, సాయికృష్ణ, కుండే కుమార్, విజయ్, శ్రీను, రమేష్, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

- వినతులకే సమస్యలు పరిమితమవుతున్నాయి
- బల్దియా ప్రజావాణిలో సమస్యలపై ప్రజల ఆవేదన



ప్రజావాణిలో డివిజన్ సమస్యలపై కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు విన్నవిస్తున్న 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకన్న

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 29 : మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ నగర వాసులు వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారు లకు విన్నవించారు. సమస్యలపై వినతులు అందజేస్తే అవి అక్కడికే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ లోని జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి జరిగింది. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నగరంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు మౌలిక సదుపాయాలపై ఏకరువు పెట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే తమ ఇబ్బందులు తెలుస్తాయంటూ వాపోయారు. సమస్యల ను వినతుల రూపంలో తెలియచేశారు. తక్షణమే పరిష్కార మార్గాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతులు స్వీకరించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు పరిష్కార ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో మొత్తం 103 వినతులు సమర్పి తమయ్యాయి.

◆ వరంగల్ శివనగర్ మెట్లబావి వద్ద 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు శ్రీనివాస్‌రావు, రాజు తదితరులు ఫిర్యాదు చేశారు.

◆ వరంగల్ గిర్మాజీపేట మాజీ కార్పొరేటర్ ఉష ఇంటి వీధిలోని రహదారిని విస్తరించాలని, దెబ్బతిన్న డ్రెయినేజీలను తొలగించి నూతన నిర్మాణాలు చేపట్టాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతూ స్థానికులు రఘోత్తంరావు, సరస్వతి, అశోక్ తదితరులు కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు అనిసూర్ రశీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు క్రిష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

◆ హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని రామక్రిష్ణకాలనీలోని ఎఫ్‌టీఎల్ పరిధిని ఆనుకుని ఉన్న స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రాన్ని అందచేశారు. అదే విధంగా 10వ డివిజన్‌కు కేటాయించిన పారిశుధ్య కార్మికుల్లో ఆరుగురు పనులకు రావడం లేదని, వీరి స్థానంలో ఇతరులను కూడా కేటాయించలేదని కమిషనర్‌కు వివరించారు. తక్షణమే కార్మికులను కేటాయించాలని కార్పొరేటర్ వెంకన్న విజ్ఞప్తి చేశారు.

◆ 57వ డివిజన్ గోకుల్‌నగర్‌లో నాలాను ఆక్రమించి జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ కాలనీ వాసి భాస్కర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

◆ హనుమకొండలోని కుడా ఎన్‌క్లేవ్ నుంచి వంద ఫీట్ల రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రహదారిని పునర్ నిర్మించాలని స్థానికులు దేవేందర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీదేవి, రామచంద్రం తదితరులు కోరారు. గతంలో వరదల కారణంగా రోడ్డు దెబ్బతిందని పేర్కొన్నారు.

ఎన్నికలు లేనట్లే..

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేసినా, ఆతర్వాత జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పంచాయతీ పాలకవర్గాలకు ప్రభుత్వం 2019లో ఎన్నికలు నిర్వహించింది. పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన పంచాయతీలకు కేటాయించిన రిజర్వేషన్లు పది సంవత్సరాలపాటు కొనసాగించేలా తీర్మానిస్తూ చట్టాన్ని రూపొందించారు. ఈ మేరకు మార్చి 2018న ప్రభుత్వం దీనిపై ఉత్తర్వులుజారీ చేసింది. సవరించిన పంచాయతీరాజ్ యాక్ట్ రిజర్వేషన్ల ప్రకారం పం చాయతీ ఎన్నికలను 2019 జనవరిలో మూడు విడత లుగా నిర్వహించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఫిబ్రవరి 2న ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.

ప్రత్యేకాధికారుల పాలన...

ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇందుకు ఇంకా మూడు రోజులే గడువు ఉండడంతో ఇప్పట్లో ఎన్నికలు అసాధ్యమనే అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎన్నికలు జరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఆదేశాలు జారీ చేసినా నిర్ణీత గడువులోగా ఎన్నికల కష్టమే. ఈక్రమంలోనే జీపీలలో ప్రత్యేక అధికారుల పాలన తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇది ఎంపీ ఎన్నికల వరకు కొనసాగే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం వచ్చే ఏడాదిలో ముగియనుంది. వీటికి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో పంచాయతీ ఎన్నికలతో కలిపే వాటిని నిర్వహిస్తారనే చర్చ కూడా సాగుతోంది. ఇలాఉంటే గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం అప్పులు చేశామని, రూ.లక్షల్లో బిల్లులు అందాల్సి ఉందని పలువురు సర్పంచులు వాపోతున్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు..

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహక బహుమతిగా రూ.10లక్షల వరకు ఇవ్వనున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు ఆయా గ్రామ పంచాయతీలకు ఒక్కపైసా కూడా విడుదల చేయకపోవడంతో నిధులు లేక ఆశించిన స్థాయిలో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగ లేదు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పను లు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

ఆశావహులూ అధికమే..

సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో పదవులను ఆశించే వారి సంఖ్య ఈసారి ఎక్కువగానే కనిపించే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ అండదండలతో బరిలో ఉండే వారు ఎక్కువే అని చెప్పొచ్చు. కొందరు ఎలాగైనా బరిలో ఉండాలనే కోరికతో ఇప్పటికే ఆయా గ్రామాల్లో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు సర్పంచ్ ఎన్నికల్లో తమ సత్తాను చాటాలని బీఆర్ఎస్ నాయకులు కూడా వీటిని ప్రతిష్ఠాత్మకంగానే తీసుకునే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రిజర్వేషన్ ఖరారైతేనే ఎవరు ఏంటనేది తెలుస్తుందని పేర్కొంటున్నారు. మరోవైపు ఆశావహులు రిజర్వేషన్లపై ఉత్కంఠగా ఉన్నారు. తమకు అనుకూలంగా వస్తుందో, రాదోనని ఆందోళన చ ఎందుతున్నారు.

జిల్లాలో 323 గ్రామాలు..

వరంగల్ జిల్లాలోని 11 మండలాలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 323 గ్రామ పంచాయతీలున్నాయి. చెన్నారావుపేట మండల పరిధిలో 30 గ్రామాలు, దుగ్గొండిలో 34, గీసుగొండలో 21, ఖానాపురంలో 20, నల్లబెల్లిలో 29, నర్సంపేటలో 27, నెక్కొండలో 39, పర్వతగిరిలో 33, రాయపర్తిలో 39, సంగెంలో 33, వర్ధన్నపేటలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

జిల్లా వెటర్నరీ ఫోరం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆకుల రాజేందర్, తదితరులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 29: టీఎన్‌జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా వెటర్నరీ ఫోరం అధ్యక్షుడు గంధం లక్ష్మణ్ ఆధ్వర్యంలో క్యాలెండర్-24 ఆవిష్కరణ జరిగింది. సోమవారం హనుమకొండలోని వెటర్నరీ ఫోరం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై, హనుమకొండ జిల్లా వెటర్నరీ ఫోరం-2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామన్న, కేంద్ర కార్యదర్శి రామన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీప్రసాద్, జిల్లా కోశాధికారి రాజేష్, వెటర్నరీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్, జిల్లా కార్యదర్శి కె.రమేష్, కోశాధికారి డి.రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



రంగంపేట చెరువు మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సంగెం, జనవరి 29 : నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పోచమ్మతండాలో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎల్గూరు రంగంపేట గ్రామంలోని దర్గా(ఉర్సు) ఉత్సవాల్లో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగెం మండంలోని ఆయా గ్రామాల సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని ప్రతీ సమస్యను పరిష్కరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

● రంగంపేట మత్తడి పరిశీలన...

ఎల్గూరు రంగంపేట పెద్ద చెరువును ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. అధిక వర్షాల కారణంగా మత్తడి కొట్టుకుపోవడంతో పాటు రహదారి ధ్వంసం కావడంతో రంగంపేట మొండ్రాయి గ్రామాల నడుమ రాకపోకలు నిలిచాయని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీని పై స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, నాయకులు జనగం రమేష్, చింతలపెల్లి సర్పంచ్ ఇండ్ల రవి, గవిచర్ల ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు టిక్కిరెడ్డి సంధ్య, అప్పాల కవిత, ఉపసర్పంచ్ రాధిక, కట్టయ్య, అనిల్, హరిబాబు, పాషా పాల్గొన్నారు.

● ఇందిరమ్మ కానుకగా తులం బంగారం: ఎమ్మెల్యే

గీసుగొండ: ఆడపడుచుల పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.లక్ష చెక్కులతోపాటు ఇందిరమ్మ కానుకగా తులం బంగారం కూడా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. కొనాయిమాకుల రైతు వేదికలో 86 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను సోమవారం అందచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాలన్ని అప్పులకుప్పగా చేసిందన్నారు. అయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజాపాలన ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేయిస్తున్నారనిన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, వైస్ ఎంపీపీ రడం శ్రావ్యభరత్, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో వీరేశం, మండల కో ఆప్షన్ సభ్యుడు రహీంపాష, సర్పంచ్‌లు ఆకుల స్రవంతిరుద్రప్రసాద్, అనసూర్య, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు చాడా కొమురారెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కొండేటి కొమురారెడ్డి, సాయిరి ప్రభాకర్, కూసం రమేష్, ఎం.డీ జావేద్, వజ్ర రాజు, దూలం వెంకటేశ్వర్లు, దౌడు ప్రవీణ్, వరిగెల రాజు, వీసాల రాజేశ్వర్‌రావు, మర్రి క్రాంతి, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు విద్యార్థులు




అభినందన్

గీసుగొండ, జనవరి 29: ఇటీవల తొర్రూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో గొర్రెకుంట జెడ్పీ పాఠశాల విద్యార్థి నక్క అభినందన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రఘువీర్ సోమవారం తెలిపారు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కోర్బా పట్టణంలో నిర్వహించే జాతీ యస్థాయి పోటీల్లో అభినందన్ పాల్గొంటున్నట్లు చెప్పారు. అభినందన్‌ను హెచ్‌ఎం జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే, మొగిలిచర్ల జెడ్పీ పాఠశాల విద్యార్థి స్వేతన్‌కుమార్ కూడా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ముఖర్జీ తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఉపాధ్యాయులు ప్రోత్సాహక నగదు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోలెపాక అనిత, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేష్, వీడీసీ చైర్మన్ నర్సింగరావు పాల్గొన్నారు.

'అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తా'



మాట్లాడుతున్న పరమేశ్వర్

మట్టెవాడ, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలుస్తానని కాంగ్రెస్ నాయకుడు రాగమల్ల పరమేశ్వర్ అన్నారు. సోమవారం వరంగల్ హంటర్‌రోడ్డులోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాజ్యాంగాన్ని గౌరిస్తే, కేసీఆర్ ఆ రాజ్యాంగాన్ని మార్చలన్న వ్యక్తి ఆరోపించారు. కనీసం మంత్రులకు కూడా కేసీఆర్ అపాంట్‌మెంట్ ఇవ్వని కారణంగానే ప్రజలు ఓడించారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మర్రి రవీందర్ పాల్గొన్నారు.

సీఐటీయూ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మట్టెవాడ, జనవరి 29: సీఐటీయూ బహిరంగ సభ పోస్టర్‌ను ఏనుమాముల మార్కెట్ ఆవరణలో సీఐటీయూ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ కార్యదర్శి అకినెపల్లి యాదగిరి హాజరై మాట్లాడుతూ జనవరి 31న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సీఐటీయూ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జాతీయ కార్యదర్శి తపన్‌సేన్, సీఐటీయూ ఏపీ, తెలంగాణ మాజీ కార్యదర్శి బీవీ.రాఘవులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాశిబుగ్గ ఏరియా నాయకులు సంగి రవి, ఎస్‌కే పాషా, జన్ను ప్రవీణ్, జన్ను చిట్టీ రాజలింగం, అఖిల్, నాగరాజు, శ్రీను, అనిత, మంజుల, సమ్మక్క, గౌస్‌పాషా, మనీల, శివాజీ, తిరుపతి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జనవరి 29 : వచ్చే వేసవి కాలంలో నర్సంపే ట నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే దొంతి మాధ వరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ, మునిసిపల్ అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ఆరు మండలాల ప్రజలకు, నర్సంపేట పట్టణ ప్రజలకు తాగునీటిని అందించాలని సూచించారు. తాగునీటి సమస్య తో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ఆయన అన్నారు. కార్య క్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ, డీఈ, మునిసిపల్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు ఏర్పాట్లు

ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఉర్సు : దర్గా పీఠాధిపతులు



సమావేశంలో మాట్లాడుతున్న దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్ బాబా

కరీమాబాద్, జనవరి 29: నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రాంతం ఉర్సు జాగీర్ దర్గాలోని హజ్రత్ సయ్యదాన మాషూక్ రబ్బాని రెహమతుల్లా అలై ఉర్సు ఉత్సవాలు ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా తెలిపారు. సోమవారం దర్గా ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో పీఠాధిపతులు మాట్లాడుతూ ఉత్సవాలకు లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశముందని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 2న నయా గడీలో రాత్రి ఇస్లామిక్ ధార్మిక సదస్సు జరుగుతుందని, ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇస్లామిక్ గురువులు పాల్గొంటారన్నారు. నయాగడీలో నిత్యాన్నదానం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 2 గంటలకు నయిగడి నుంచి పవిత్ర గంధోత్సవం ఊరేగింపుగా దర్గాకు చేరి పవిత్ర సమాధికి గంధలేపనం చేస్తారని తెలిపారు. 3న ప్రత్యేక ప్రార్థనలు, 4న ఉర్సు ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. ఉత్సవాలను మంత్రి కొండా సురేఖ పర్యవేక్షణలో వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యాఖ్యాత సయ్యద్‌మగ్దుం, సైలానీ బాబా, యుగేందర్, చాంద్‌పాషా, అమీర్, బాబా ఖాదర్, బాసిత్ తహీర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వర్ధన్నపేట, జనవరి 29 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ వర్ధన్నపేట మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ పరీక్షల సమయంలో సమయానుకూలంగా బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, అభిమార్, సుశాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న యాకాంబ్రం

నెక్కొండ, జనవరి 26 : ప్రైవేటు పాఠశాలల కంటే అర్హత కలిగిన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని మండలంలోని చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రవికుమార్ కోరారు. చంద్రుగొండ గ్రామానికి చెందిన రిటైర్డు రైల్వే ఉద్యోగి బీర్రు యాకాంబ్రం సోమవారం 60 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు పుస్తకాలు, బట్టలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని అన్నారు. విశాలమైన క్రీడామైదానాలు ఉన్న పాఠశాలల్లో పీఈటీలు విద్యార్థులను రకరకాల ఆటలు ఆడించి ఉత్తమ క్రీడాకారులు గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాణించిన విద్యార్థులు ఐఐటీ వంటి ఉన్నత విద్యలో సులువుగా అడ్మిషన్లు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకం పున్నంచందర్, పి.గీత, కె.కృష్ణారావు, ఎల్. సునిల్, వి.శ్రీనాథ్, ఎం.శంకరయ్య, రజిత, పీఈటీ బి.రతన్‌సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ధర్మరావుపేటలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు

ఖానాపురం, జనవరి 29 : మండలంలోని ధర్మరావుపేట స్వయంభూ శ్రీదేవి- భూదేవి సమేత పగడాల వేంకటేశ్వరస్వామి తృతీయ వార్షిక కల్యాణ మహోత్సవం, జాతర ఉత్సవాల వాల్ పోస్టర్లను గుడి నిర్మాణ కర్తలు మాడ్రాజు రేణుక-వెంకన్నల ఆధ్వర్యంలో సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్, ఎంపీటీసీ బల్గూరి విజాకర్ రావు, ఆలయ ప్రధాన పూజారి దేవరకొండ అన్వేష్‌శాస్త్రిలతో కలిసి గ్రామస్థులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న పగడాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, జాతర, మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించబడతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో లింగబత్తుల యాక సాయన్న, నడపెల్లి రాజేశ్వర్‌రావు, వల్లే శ్రీనివాస్, అటిక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈవోకు సన్మానం



ఎంఈవో రంగయ్యను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రాయపర్తి, జనవరి 29 : రాయపర్తి ఎంఈవో నోముల రంగయ్య సేవలు ఆదర్శనీయమని వర్ధన్నపేట లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రావుల అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల జిల్లా ఉత్తమ ఎంఈవోగా అవార్డు అందుకున్న రంగయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల పట్ల అనేక రకాలుగా శ్రద్ధ తీసుకుని భవిష్యత్తును దిశానిర్దేశం చేయడంలో రంగయ్య కృషి చేస్తున్న తీరు గర్వకారణమని తెలిపారు.పాఠశాలల్లో మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేసి పాఠాలను బోధించే విషయంలో ఉపాధ్యాయులకు సరైన సూచనలు చేస్తున్నాడని తెలిపారు. పిల్లల భవిష్యత్తు ఎలా ఉండాలో చెపుతూ వారి అభ్యున్నతికి తోడ్పడుతున్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జడ్‌సీ మందాటి సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి సునీల్ కుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా ఓటమికి నేనే బాధ్యత వహిస్తా...

- ఎవరి కోసం పార్టీ ఆగదు...
- కారెక్కేవారు ఎక్కొచ్చు.. దిగేవారు దిగొచ్చు
- పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 29 : గత అసెంబ్లీ ఎన్నికలో తన ఓటమికి తానే బాధ్యత వహిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో సోమవారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మహబూబాబాద్ ఎంపి మాలోతు కవిత పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరి కోసం పార్టీ ఆగదని, కారు ఎక్కేవారుఎక్కొచ్చు, దిగాలనుకునే వారు దిగొచ్చని నిర్మొహమాటంగా అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉన్నానని, ఇప్పుడు కూడా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం 24గంటల పాటు తెరచి ఉంటుందని, తన స్టాఫ్ అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయని, పార్టీ నిలబెట్టిన ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడానికి బూత్‌స్థాయి. గ్రామ, మండల, పట్టణ స్థాయి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వాళ్ళు చిల్లర రాజకీయం చేస్తున్నారని, బీఆర్ఎస్ కార్యకర్తలతో అనుచితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నర్సంపేట అభివృద్ధి కోసం తెచ్చిన జీవోలను, పథకాలను ఎమ్మెల్యే చెప్పడంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. రూ.760 కోట్లు నర్సంపేట అభివృద్ధికోసం తీసుకురాగా, ఆ పనులను స్థానిక ఎమ్మెల్యే నిలిపి వేయాలని అధికారులను ఆదేశించారని ఆయన అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కూడా నిలిపి వేయించారని పేర్కొన్నారు. 1360 పనులకు శంకుస్థాపన చేశామన్నారు. వచ్చిన నిధుల్లో రూపాయి ల్యాప్స్ అయినా ఊరుకోమని ఆయన అన్నారు. వచ్చిన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను కొనసాగించాలన్నారు.

ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరీ చేయించుకొచ్చిన పెద్ది సుదర్శన్‌రెడ్డి ఓడిపోవడం దురదృష్టకరమని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాయిడి రవీందర్ రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, నామాల సత్యనారాయణ. ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ఎంపిటిసిలు, సర్పంచులు, సొసైటీ చైర్మెన్‌లు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



వర్ధన్నపేటలో సర్టిఫికెట్లతో విద్యార్థులు

వర్ధన్నపేట, జనవరి 29 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని శ్రీఅరబిందో హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా వర్ధన్నపేట ఎంఈఓ ఎస్.రంగయ్య, ప్రిన్సిపాల్ ఎస్.సంపత్‌రావు, జేవీవీ మండల కన్వీనర్ తాబేటి లింగమూర్తి, పాఠశాల డీన్ బి.వీరన్న పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విభాగంలో నిర్వహించిన పోటీల్లో జడ్పీహెచ్ఎస్ ఇల్లంద, టీఎస్ఎంఆర్ఐఈఎస్ వర్ధన్నపేట, జడ్పీహెచ్ఎస్ ల్యాబర్తి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచినట్లు వారు పేర్కొన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల విభాగంలో అల్ఫోర్స్, ఫ్యూచర్‌కిడ్స్, శ్రీఅరబిందో పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలో నిలువగా, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గైడ్ టీచర్లు రాజ్‌కుమార్, సంపత్, విజయ్, మాధవి, వివేక్ వతి, కిశోర్‌కుమార్, సోమయ్య పాల్గొన్నారు.

- ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. మండలంలోని 12 హై స్కూళ్ల నుంచి 8, 9, 10వ తరగతులకు చెందిన 36మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.ఇంగ్లీష్ మీడియం విభాగంలో అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు, తెలుగు మీడియం విభాగంలో మంగళవారిపేట హై స్కూల్ విద్యార్థులు గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చెకుముకి పోటీల మండల కన్వీనర్ సుధాకర్, హెచ్ఎంలు విజయ, ఆరిఫ్‌హుస్సేన్, చంద్రమౌళి, మోతీలాల్ పాల్గొన్నారు.
- చెన్నారావుపేట: మండల స్థాయి చెకుముకి పోటీలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే ఇంద్రాసేనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి. మూఢనమ్మకాలపై అపోహలను తొలిగించడానికి, చెకుముకి పోటీ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు.

ప్రతీ సంవత్సరం విద్యార్థులకు సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మండల స్థాయిలో ఉప్పరపల్లి, సిద్దార్థ హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలువగా, విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మండల నోడల్‌అధికారి సరళ, హెచ్ఎం పాపమ్మ, పత్తి నర్సింహారెడ్డి, రమణయ్య, శ్రవణ్, పలవి., సంతోష్, కృష్ణా, సుధాకర్, నర్సింహారాములు. సీఆర్పీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

- నల్లబెల్లి : మండల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్లో నిర్వహించారు.ఈ టాలెంట్ టెస్ట్‌లో విజయం సాధించిన నల్లబెల్లి ప్రభుత్వ హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పూజిత, మధురిత, సుమశ్రీ, కేజీబీవీ తెలుగు మీడియం విద్యార్థులు ఝాన్సీ హిమబిందు, కీర్తన, ప్రైవేట్ స్కూల్ కేబీఎస్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రదీప్, భావాని, సుచేస్‌లకు స్థానిక ఎస్సై నైనాల నాగేష్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెకుముకి జిల్లా బాధ్యుడు ఎండీ రాయబోస్, మండల బాధ్యుడు సంతోష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పర్వతగిరి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు-2023 పరీక్షను మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి, హెచ్ఎం రమేష్, జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ పాక శ్రీనివాస్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పరీక్షకు మండలంలోని అయా గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షలో మొదటిస్థానం సాధించిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించడంతో పాటు జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు వారు తెలిపారు.

ముగిసిన తిమ్మంపేట దర్గా ఉత్సవాలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వహకుడు షేక్ జబ్బార్

దుగ్గొండి, జనవరి 29 : మండలంలోని తిమ్మంపేట గుండం చెరువు కట్టపై ఉన్న హజరత్ సయ్యద్ యాఖుబ్ షావలి బాబా దర్గా ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభమై సోమవారం ముగిశాయి. 27న గంధం రాక, 28 దీపారాధన, సహపంక్తి భోజనం 29న ఖురాన్ పఠనంతో ఉత్సవాలు ముగిసినట్లు నిర్వహకుడు షేక్ జబ్బార్ తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన పోలీసులకు, ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పర్వతగిరి, జనవరి 29: తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) క్యాలెండర్‌ను సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బండి రమేష్, నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా హరిలాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి, ప్రమోషన్లు, బదిలీలను చేపట్టాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, 317 జీవో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చి స్పౌజ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాక రమేష్, మడత భాస్కర్, పుల్ల అనీల్‌కుమార్, శ్రీధర్, పరుశరాములు, రాజ్‌కుమార్, అశోక్ కుమార్, గోనె రమేష్, గారె శ్రీనివాస్, ఉమాదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఫీ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

నర్సంపేట టౌన్, జనవరి 29: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో జరిగిన ఏఐఎఫ్‌డీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. అనేక పాఠశాలలు, కళాశాలల్లో మరుగు దొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో వంశీ, బిందు, గీత, సాగరిక, శ్రీకాంత్, సాగర్, స్రవంతి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నర్సయ్య మృతి

నల్లబెల్లి, జనవరి 29 : మండలంలోని నారక్కపేట గ్రామ మాజీ సర్పంచ్ చెన్నమల్ల నర్సయ్య మృతి తీరనిలోటని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. నారక్కపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెన్నమల్ల నర్సయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నారక్కపేటకు చేరుకొని నర్సయ్య మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు బానోతు సారంగపాణి, కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్ గుప్తా, ఇంగ్లీ శివాజీ, మంద రాజిరెడ్డి, వక్కల చంద్రమౌళి, కారకూరి శ్రీనివాస్, ఓడెల రవి తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడిగా సామేల్

వర్ధన్నపేట, జనవరి 29 : వర్ధన్నపేట నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడిగా చింత సామేల్ (సీయోను)ను నియమించినట్లు వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాసాని రమేశ్, జిల్లా మహిళ కన్వీనర్ రాజేశ్వరి, వర్ధన్నపేట మాజీ అధ్యక్షుడు, ఇన్‌చార్జిలు నాగరాజు, వేణుగోపాల్, దామెర పరమేశ్వర్, సంకినేని మధు, కృష్ణగౌడ్, అవినాష్, నవీన్, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

ఎన్నికలు లేనట్లే..

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేసినా, ఆతర్వాత జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పంచాయతీ పాలకవర్గాలకు ప్రభుత్వం 2019లో ఎన్నికలు నిర్వహించింది. పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన పంచాయతీలకు కేటాయించిన రిజర్వేషన్లు పది సంవత్సరాలపాటు కొనసాగించేలా తీర్మానిస్తూ చట్టాన్ని రూపొందించారు. ఈ మేరకు మార్చి 2018న ప్రభుత్వం దీనిపై ఉత్తర్వులు సైతం జారీ చేసింది. సవరించిన పంచాయతీరాజ్ యాక్ట్ రిజర్వేషన్ల ప్రకారం పంచాయతీ ఎన్నికలను 2019 జనవరిలో మూడు విడతలుగా నిర్వహించింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఫిబ్రవరి 2న ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.

• ప్రత్యేకాధికారుల పాలన...

ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇందుకు ఇంకా మూడు రోజులే గడువు ఉండడంతో ఇప్పట్లో ఎన్నికలు అసాధ్యమనే అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎన్నికలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఆదేశాలు జారీ చేసినా నిర్ణీత గడువులోగా ఎన్నికల కష్టమే. ఈక్రమంలోనే జీపీలలో ప్రత్యేక అధికారుల పాలన తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇది ఎంపీ ఎన్నికల వరకు కొనసాగే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం వచ్చే ఏడాదిలో ముగియనుంది. వీటికి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో పంచాయతీ ఎన్నికలతో కలిపేవాటిని నిర్వహిస్తారనే చర్చ కూడా సాగుతోంది. ఇలాఉంటే గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం అప్పులు చేశామని, రూ.లక్షల్లో బిల్లులు అందాల్సి ఉందని పలువురు సర్పంచులు వాపోతున్నారు.

• ఏకగ్రీవ పంచాయతీలకు..

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహక బహుమతిగా రూ.10 లక్షల వరకు ఇవ్వనున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు ఆయా గ్రామ పంచాయతీలకు ఒక్కపైసా కూడా విడుదల చేయకపోవడంతో నిధులు లేక ఆశించిన స్థాయిలో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగలేదు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

• ఆశావహులూ అధికమే..

సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో పదవులను ఆశించే వారి సంఖ్య ఈసారి ఎక్కువగానే కనిపించే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ అండదండలతో బరిలో ఉండే వారు ఎక్కువే అని చెప్పొచ్చు. కొందరు ఎలాగైనా బరిలో ఉండాలనే కోరికతో ఇప్పటికే ఆయా గ్రామాల్లో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు సర్పంచ్ ఎన్నికల్లో తమ సత్తాను చాటాలని బీఆర్ఎస్ నాయకులు కూడా వీటిని ప్రతిష్ఠాత్మకంగానే తీసుకునే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రిజర్వేషన్ ఖరారైతేనే ఎవరు ఏంటనేది తెలుస్తుందని పేర్కొంటున్నారు. మరోవైపు ఆశావహులు రిజర్వేషన్లపై ఉత్కంఠగా ఉన్నారు. తమకు అనుకూలంగా వస్తుందో, రాదోనని ఆందోళన చ ఎందుతున్నారు.

• జిల్లాలో 323 గ్రామాలు..

వరంగల్ జిల్లాలోని 11 మండలాలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 323 గ్రామ పంచాయతీలున్నాయి. చెన్నారావుపేట మండల పరిధిలో 30 గ్రామాలు, దుగ్గొండిలో 34, గీసుగొండలో 21, ఖానాపురంలో 20, నల్లబెల్లిలో 29, నర్సంపేటలో 27, నెక్కొండలో 39, పర్వతగిరిలో 33, రాయపర్తిలో 39, సంగెంలో 33, వర్ధన్నపేటలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే దొంతి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, జనవరి 29 : వచ్చే వేసవి కాలంలో నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ, మునిసిపల్ అధికారులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ఆరు మండలాల ప్రజలకు, నర్సంపేట పట్టణ ప్రజలకు తాగునీటిని అందించాలని సూచించారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ, డీఈ, మునిసిపల్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వర్ధన్నపేట రూరల్, జనవరి 29 : మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో ఫాదర్ ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని 201 మందికి చిన్నపురెడ్డి మెడికల్ జనరల్ ఆస్పత్రి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులు పంపిణీచేశారు. గ్రామ యువత మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గోపాల్, మహేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట, జనవరి 29 : వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని భవానికుంట తండాకు చెందిన అంగోతు శ్రీను గుండెపోటుతో మృతిచెందగా పార్థివ దేహానికి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే డీసీ తండాకుచెందిన బానోతు శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని, ఇదే తండాకు చెందిన అంగోతు భీమా కాలుకు గాయంతో ఆయ నను సైతం పరామర్శించి ధైర్యంచెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం



సర్పంచ్‌లను సన్మానం చేస్తున్న ఎంపీపీ, అధికారులు

దుగ్గొండి, జనవరి 29 : మండలంలోని 34 గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెలతో పూర్తి కానున్నడంతో మండల పరిషత్ కార్యాలయంలో సోమ వారం సర్పంచ్‌లను ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య ఎంపీడీ వో కృష్ణప్రసాద్, ఎంపీటీసీలు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు అభినందలు తెలిపారు. ఎంపీవో శ్రీధర్‌గౌడ్, సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈ వెంకటేశ్వర్లు, వీరన్న, ఎంపీటీసీలు పిండి కుమారస్వామి, మాలోతు చంద్రు, రాజుసర్పంచ్‌లు మోడెం విద్యాసాగర్, పెండ్యాల మమత, ముదురకోల శారద, భవాని, తోకల మంజుల, సురేందర్‌రెడ్డి, స్వామి, పైడయ్య, ఊర్మిళ, ఉమరవీందర్, మమత, చుక్క రమేశ్, రవీంద్ర నాయక్ మహేందర్, తిరుపతిరెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



ఆర్డీవో ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట టౌన్, జనవరి 29 : నర్సంపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో అనేక మంది పేదలు సొంత ఇంటి స్థలాలులేక, ఇల్లు నిర్మించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాకూబ్, శారద, నర్సింహారెడ్డి, నర్సింహస్వామి పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

చెన్నారావుపేట, జనవరి 29 : నల్గొండ, వరంగల్. ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో గ్రాడ్యుయేట్ చేసిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఫారమ్స్ 18లను అందించారు. ఈ నెల 6 వరకు ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీల ఓటుగా నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాపమ్మ, బైరి సరళ, మండల అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర బాధ్యులు పొలెపల్లి రవి. మోతే ఇంద్రారెడ్డి, అనిల్‌కుమార్, నర్సింహారెడ్డి, పూదోట సంతోష్‌కుమార్, అనసూయా, అమీనా, లఖుపతి తదితరులు పాల్గొన్నారు.